# తారు మారు

శశికుమార్ హోటల్లో కూర్చుని కాఫీ త్రాగుతున్నాడన్నమాటే కాని అతని మనస్సు మనస్సులో లేదు. అతడు పద్మను ప్రేమించాడు. కాని ఆమె ప్రేమను పొందే దెలా? హఠాత్తుగా అతని బుర్రలోకి ఏదో ఆలోచన వచ్చింది. దాంతో పాటే ఒక చిరునవ్వుకూడా అతని పెదవులమీద తాండవించింది. వెంటనే కుర్చీలోంచి లేచి బిల్లు చెల్లించి హోటల్ బయటకు వచ్చాడు. ప్యాంటుజేబులోకి చేతులు పోనిచ్చి ఒక్కసారి పెడసారించి బజారుకేసి చూశాడు.

బస్సులు, సైకిళ్లు, రిక్షాలు, ఒక దాని వెంట ఒకటి వరుసగా పోతున్నాయి. నెమ్మదిగా కదిలి రోడ్డుకు అడ్డంగా నడచి ఓ సందుగుండా నడక సాగించాడు.

ఇంతలో అతనికి కనుచూపు దూరంలో దారికి ఓ ప్రక్కగా కూర్చున్న వ్యక్తి కన్పించాడు. ఆ! యితడే తనపనికి కావాల్సినవ్యక్తి. సమయానికి దొరికాడని గబగబా అతని దగ్గరవెళ్ళి "ఏయ్! నీ పేరేమిటి?" అన్నాడు. వాడు కాకీ నిక్కర్ తెల్లని చినిగిన చొక్కా, ఎర్రటి కండువా వేసుకొని అచ్చం రౌడీలా వున్నాడు. శశికుమార్ "ఏయ్!" అనగానే వాడి ప్రాణాలు పోయినంతపనైంది ఏ సి. ఐ. డి. యో వీడని.

"సార్! నా పేరు...నా పేరు...అబదం సార్" అన్నాడు తడబడుతున్న గొంతుకతో. "అయితే అబద్ధం! నాకు ఒక చిన్న పని చేసిపెట్టాలి చేస్తావా?"

వాడు కొంచెం ధైర్యం తెచ్చుకుని "పనా పనిచెయటం అంటే నాకు గిట్టదుసార్!" అన్నాడు.

"అదికాదు. నాకు చిన్న సాయం చెయ్యి. అందుకు కొంతడబ్బు ఇస్తాను"

"ఓ! అయితే చేస్తా. ఏమిటో చెప్పండి"

"ఏమీ లేదు" అంటూ అటు, యిటూ శశికుమార్ ఒకసారి పరకాయించిచూచి వాడి చెవిలో ఏదో చెప్పాడు.

"అదెలాకుదురుతుందిసార్! ఆఅమ్మాయి ఒప్పుకోకపోతే నే నేం చేస్తాను సార్?" అన్నాడు వాడు ఆముదం త్రాగిన ముఖం పెట్టి.

"అందుకు నేను వుపాయంకూడా కనిపెట్టాను. విను మరి చెప్తా."

మళ్ళీ చెవిలో ఏదో పరమరహస్యం చెప్పాడు.

"సరేసార్ చేస్తా,"

"మరి ఎంత యివ్వమంటావ్?"

"ఓ వందరూపాయలు ఇప్పించండి."

"సరే అలాగే యిస్తాను."

"సార్! అడ్వాన్సు కొంతడబ్బు ఇప్పించండి."

"ఇదిగో యాభైరూపాయలు."

## చుక్కా నాగేశ్వరరావు

"సార్! రేపు యీపాటికి యిక్కడికి వస్తా."

"ఏడ్చినట్లుంది. ముందు యీరోజు ఆ అమ్మాయిని చూపించనీ. ఆ తర్వాత రేపు ఆపని.."

"చిత్తం"

## 2


తెనాలి గాంధీపార్కు టవర్ క్లాక్ అప్పుడే సాయంత్రం ఆరుగంటలు కొట్టింది. పార్కుపక్క సందు పేవ్ మెంటుమీద శశి, అబద్దం కూర్చున్నారు. ఇంతలో ఎత్తు మడమల బూట్లతోనూ వాలు జడతోనూ వయ్యారంగా నడచుకొంటూ ఓ అందమైన అమ్మాయి పార్కులోకి వెళ్ళింది. తదేక ధ్యానంగా చూస్తున్న శశికుమార్ ని "సార్! ఆమేనండి" అన్నాడు అబద్ధం. ధ్యాన భంగమైన ఋషిలా మేల్కొని—"అవును అబద్ధం! ఇక తిరిగి వచ్చేప్పటికి రెడీగా వుం"డన్నాడు వాడితో.

ఇంతలో చీకటి నలువైపులా వ్యాపింపించింది. పగలే ఆసందులో జనం అట్టే నడవరు. కాని పద్మ రోజూ సాయంత్రం ఈ దారిగుండానే పార్కులోకివస్తుంటుంది.

అప్పుడే పార్కునుండి పద్మయింటికి తిరిగి వెళ్తోంది. శశికుమార్—కర్తవ్యం నెరవేర్చమని అర్జునుడికి కృష్ణపరమాత్మ గీతలో బోధిస్తున్నట్లుగా అబద్ధానికి చెప్పి దూరంగా తొలగిపోయాడు.

ఆమె పేవ్ మెంటు దగరికిరాగానే బొడ్లోంచి కత్తితీసి "నీ నగలు యిస్తావా? ప్రాణం తీసుమంటావా?" అని బెదిరించాడు అబదం. పద్మ ఆ దెబ్బతో హడలిపోయింది. కేకలు వేయాలనుకొన్నా పీకమీదే పెట్టాడు కత్తి. తప్పనిసరియై ఆమె నగలన్నీ యిచ్చింది. అవి మూటగట్టుకొని గబగబ దారిప్రక్కనున్న తోటగోడదూకి మాయంఅయాడు వాడు.

అతడు పోయాక "దొంగ దొంగ" అని

# ★ తారుమారు ★

పద్మ కేక వేసింది. "ఎవరూ? నీవా? పద్మా! ఏమిటి?" అంటూ శశికుమార్ రంగంలోకి దూకాడు.

"శశికుమార్! అడుగో! వాడే నా సొమ్ములన్నీ కాజేశాడు." అంటూ మసక చీకట్లో వస్తున్న ఆ బద్ధాన్ని వేలితో చూపింది.

"ఉండు వాడిపని చెప్తా"నంటూ గబగబా పరుగెత్తుకెళ్ళి వాణ్ణి పట్టుకొని "భేష్! నాటకం బాగా ఆడావు" అన్నాడు.

"సరే నా డబ్బు యివ్వండి వెళ్తా" అన్నాడు వాడు

"అదికాదోయ్! ఆమె ముందుకు నిన్ను తీసుకువెళ్ళి కొడ్తున్నట్లు నటిస్తాను. నీవు ఆ తర్వాత వెళ్ళవచ్చు."

"సరే!"

"ఇదిగో మిగిలిన యాభైరూపాయలు."

## 3

శశికుమార్ వాణ్ణి పట్టుకొని పద్మదగ్గరికి లాక్కొచ్చాడు "ఏంరా వెధవా! ఒంటరిగా ఆడపిల్ల వెళ్తుంటే ఇదేరా చేసేది?" అంటూ స్టంట్ హీరో ఫోజ్‌లో చొక్కా చేతులు పైకిలాగి నాలుగు దెబ్బలు కొట్టాడు

వాడు "నాకు బుద్ధివచ్చింది బాబూ! ఇక ఎప్పుడూ యిలాంటి పని చేయను" అని బ్రతిమాలాడు.

"శశికుమార్! పోనీ వాణ్ణి. మనసొమ్ము యిచ్చాడుగా" అంది జాలిగా

"జాగ్రత్త. ఎక్కడైనా కనిపించావా డొక్క చీల్చివేస్తా. పో!" అంటూ గదమాయించాడు శశికుమార్.

"చిత్తం" అంటూ వాడు చీకట్లో మాయమయ్యాడు.

వాడు వెళ్ళిన తర్వాత పద్మ— "అమ్మయ్య! నీవే సమయానికి రాకపోతే నా నగలన్నీ పోయేవి శశికుమార్! యిన్నాళ్ళుగా నిన్ను అపార్థం చేసుకొన్నా క్షమించు" అన్నది.

ఇద్దరూ పద్మయింటికి చేరారు. అక్కడ కూడా ఆమె తనకృతజ్ఞత చెప్పింది.

లైట్ స్విచ్ ఆన్ చేసి సోఫాలో శశికుమార్‌ని కూర్చోపెట్టి తను యింట్లోకి వెళ్ళి డ్రెస్ మార్చుకువచ్చింది ఇంతలో డ్రాయర్ పైనవున్న వారపత్రిక శశికుమార్ తిరగవేస్తున్నాడు. పద్మమాటవిప్పింది "ఒక్కసారిగా యీనగలు నావి కావే" అంది దాంతోపాటే ఓ కాగితం యిలాచదివింది.


"శశికుమార్! నీ నాటకంతోపాటు నేరుగా నేనూ ఒక నాటకం ఆడాను ఏమిటంటే నీవు చెప్పినప్రకారం ఆ అమ్మాయిని కత్తితో బెదిరించి సొమ్ములు కాజేశాను. అంతకుముందు మీరిచ్చిన అడ్వాన్సుతో కొన్ని గిల్టునగలు కొని ఒకమూటలో యీ తోటలో దాచాను. అసలు నగల మూట దాచి ఆ గిల్టునగల మూట నీకు యిచ్చాను.

ఇది చూసే మీ ప్రియురాలు మీకు దక్కదని నాకు తెలుసు అందుకు విచారిస్తున్నాను. అయినా మనలో మాట ప్రేమించని అమ్మాయిని నీవు యిలా చేయటం న్యాయమా? అసలు నాపేరు అబద్ధంకాదు. నేను చదువుకొన్నాను. ఉద్యోగం లేక నాటకాల్లో దిగాను. అయితే యిలాంటి పాత్ర అభినయించటం యిదే మొదటిసారి. ఆఖరిసారి కూడాను. హాయిగా మీవల్ల దొరికిన యీ డబ్బుతో సుఖంగా జీవితం గడుపుతాను.

ఇట్లు

'.........'

ఉత్తరం చదివి పద్మ కోపంతో తొక్కత్రొక్కిన త్రాచుపాములాగా లేచింది. వింటున్న శశికుమార్ రాతిబొమ్మలాగా సోఫాలో కూర్చుండి పోయాడు. టెలిఫోన్ హుక్ అందుకొని పోలీసు స్టేషన్‌కి పద్మ కాల్ చేసింది. ★

కార్బోరండమ్ యూనివర్సలు వారి ఉత్పత్తి పరికరములు (Bonded Abrasives) సానరాళ్లు, పదునుపెట్టురాళ్లు, అరుగదీయు రాళ్లు, మెఱుగుపెట్టు రాళ్లు, గ్రైన్డింగు కాంపౌండు మొదలగునవి.

మీరు
రామునిపై ఆధారపడవచ్చును

ఏమన—ఒక చిన్న వస్తువునుండి పెద్ద ట్రాక్టరువరకు క్రొత్తవానివలె అగుపడునట్లు చేయును. మంచి పరికరములవలన మంచిపని రాబట్టగలమని రామునికి తెలియును. కాబట్టి అతను సానబెట్టుటకు మరియు మెఱుగు పెట్టుటకు కార్బోరండమ్ యూనివర్సలు వారిచే యుత్పత్తి చేయబడిన సానరాళ్లనే ప్రత్యేకముగా వాడును. ఇవి ప్రపంచమందలి మంచి రకములకు సాటియై యున్నవి.

ఈ ట్రేడ్‌మార్కు శ్రేష్ఠమగు వివిధ రకములగు సానరాళ్లకు నిలువును.

CUZ-33 TG

## కార్బోరండమ్ యూనివర్సల్ లిమిటెడ్.

హెడ్ ఆఫీసు: "స్వాస్తిక్ హౌస్" 106, ఆర్మీనియన్ స్ట్రీట్, టెలిఫోను: 2941 (4 లైనులు) కార్ఖానా: తిరువత్తియూర్, మద్రాసు.

—— పంపకపుదార్లు: ——

| మెస్సర్స్ విలియం జాక్స్ అండ్ కో., లిమిటెడ్. | మెస్సర్స్ స్కాట్ అండ్ పిక్‌స్టాక్ ప్రైవేటు లిమిటెడ్. | మెస్సర్స్ ఎచ్. ఎస్. కాక్స్ అండ్ కో., ప్రైవేట్ లిమిటెడ్. |
|---|---|---|
| కలకత్తా-1. బొంబాయి-1. మద్రాసు-1. న్యూఢిల్లీ. బెంగుళూరు-1. కాన్‌పూర్. | కలకత్తా-1. బొంబాయి-1. మద్రాసు-1. బెంగుళూరు. కాన్‌పూర్. హైదరాబాద్-(దక్కన్) | 24, రామ్‌పార్ట్ రో బొంబాయి. (ప్రత్యేక రకాలకు మాత్రమే) |